ప్రజాశక్తి

గురువారం ఏప్రిల్ 25 2024 8 పేజీలు

శ్రీకాకుళం

కాలం చెల్లిన నియోజకవర్గాలు

పాత జ్ఞాపకాలుగా మిగిలిన వైనం

(4, 5లో)

బాబు వస్తే పథకాలు రద్దు

మాట్లాడుతున్న సిఎం జగన్మోహన్ రెడ్డి

- మంచి జరిగితేనే వైసిపికి ఓటేయండి
- విప్లవాత్మక మార్పులు తెచ్చాం
- టెక్కలిలో మార్పుకు చోటివ్వండి
- సిద్ధం ముగింపు సభలో సిఎం జగన్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, టెక్కలి, రూరల్, సంతబొమ్మాళి

ఎన్నికల్లో చంద్రబాబుకు ఓటు వేస్తే, తాము ఆమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ రద్దవుతాయని ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. టెక్కలి మండలంలోని అక్కవరం సమీపంలో బుధవారం నిర్వహించిన సిద్ధం ముగింపు సభలో ఆయన ప్రసంగించారు. విద్య, వైద్యం, వ్యవసాయం వంటి రంగాల్లో ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామని, దీనిపై ప్రజలు ఆలోచించాలని కోరారు.

ప్రతి గ్రామంలో ఇంటింటికీ సేవలందించేందుకు వాలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో 1.35 లక్షల మంది ఉద్యోగులు పలు సేవలను అందిస్తున్నారని తెలిపారు. ఫించన్‌దారులకు ఒకటో తేదీనే ఇంటింటికీ వెళ్లి పెన్షన్ అందించేలా వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. పేదల జీవితాల్లో మార్పులు తీసుకురాగలిగామని, మరో ఐదేళ్ల ఇవి కొనసాగాలంటే తమను ఆదరించాలని కోరారు. ప్రతి ఇంటికీ మంచి జరిగితేనే తమకు ఓటు వేయాలన్నారు. (మిగతా...2లో)

సిద్ధం సభకు తరలివచ్చిన వైసిపి శ్రేణులు

రామ్మోహన్ నాయుడు, శంకర్‌ను గెలిపించాలని కోరుతున్న చంద్రబాబు

మహిళాభివృద్ధికే 'సూపర్ సిక్స్'

- జగన్‌కు దిమ్మ తిరిగే తీర్పు ఇవ్వాలి
- జిల్లా అభివృద్ధి బాధ్యత తీసుకుంటా
- టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఇంటి ఆర్థిక పరిస్థితులను చక్కబెట్టే ప్రతి మహిళకు మేలు చేకూర్చేలా సూపర్ సిక్స్ పథకాలను రూపొందించామని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ మైదానంలో బుధవారం నిర్వహించిన ప్రజాగళం మహిళలతో ముఖాముఖిలో ఆయన ప్రసంగించారు. టిడిపి అధికారంలోకొస్తే (మిగతా...2లో)

పాల్గొన్న మహిళలు

కూల్ అయిన 'కలమట'

- ఫలించిన చంద్రబాబు బుజ్జగింపు
- టిడిపిలోనే ఉంటానని ప్రకటన
- నామినేషన్ యోచన విరమణ
- పార్టీ జిల్లా పగ్గాలు అప్పగించే యోచన

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పాతపట్నం టిడిపి టిక్కెట్ కేటాయించకపోవడంతో, స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగుతానని ప్రకటించిన ఆ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కలమట వెంకటరమణ చివరకు కూల్ అయ్యారు. ప్రజాగళం సభ కోసం జిల్లాకు వచ్చిన టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును మంగళవారం రాత్రి కలిశారు. అధికారంలోకి వచ్చాక తగిన

ప్రాధాన్యం ఇస్తానని చంద్రబాబు భరోసా ఇచ్చారు. దీంతో స్వతంత్ర అభ్యర్థిగా బుధవారం నామినేషన్ దాఖలు చేయాల్సిన ఆయన, ఎన్నికల బరి నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. తాను తెలుగుదేశం పార్టీలోనే కొనసాగుతానని తెలిపారు. శ్రీకాకుళం నగరంలో చంద్రబాబు బుధవారం నిర్వహించిన మహిళలతో ముఖాముఖి కార్యక్రమానికి హాజరైన టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ తాను అధ్యక్ష పదవి నుంచి తప్పుకుంటానని, ఆ (మిగతా...2లో)

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

- స్కానింగ్ కేంద్రాల తనిఖీకి ఆరు బృందాలు
- జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి హెచ్చరించారు. జిల్లాలోని మూడు డివిజన్ల పరిధిలో స్కానింగ్ కేంద్రాల తనిఖీకి ఆరు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా నగరంలోని గొలివి, బగ్గు సరోజినీదేవి, ఎ1 ఆస్పత్రుల్లో బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఐవిఎఫ్‌కు సంబంధించి పాటించాల్సిన నియమ నిబంధనలను క్షుణ్ణంగా పరిశీలించారు. స్కాన్ చేసిన తర్వాత 24 గంటల్లో ఫారమ్-ఎఫ్‌ను పిసిపిఎన్‌డిటి వెబ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రతి నెలా ఐదో తేదీ లోగా జిల్లా వైద్యారోగ్యశాఖ ఆరోగ్యశాఖ కార్యాలయానికి ఫారం-ఎఫ్‌ను అందజేయాలన్నారు. ఐదేళ్ల కాలపరిమితి పూర్తయిన ఆస్పత్రులు, లేబొరేటరీలు, డెంటల్, ఫిజియోథెరపీ క్లినిక్‌లు తప్పనిసరిగా రెన్యువల్ చేసుకోవాలన్నారు. లేకుంటే అపరాధ (మిగతా...2లో)

తనిఖీలు చేస్తున్న బృందం సభ్యులు

రేపు నామినేషన్ల పరిశీలన

జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఈనెల 26వ తేదీన నామినేషన్ల పరిశీలన చేపట్టనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. 29వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లను ఉప సంహరించుకునేందుకు వీలు ఉంటుందన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ల ఉపసంహరణ అనంతరం గుర్తు కేటాయింపు ఉంటుందని తెలిపారు. ఈ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా ఉండేందుకు ఆర్‌ఒలకు శిక్షణ ఇచ్చామన్నారు. ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకుల సమక్షంలో నామినేషన్ల పరిశీలన ఉంటుందని తెలిపారు. మే 7 నుంచి 9వ తేదీ వరకు హోం ఓటింగ్‌కు చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. జిల్లాలో ఒక్కరోజులోనే పూర్తి చేసేలా బృందాలను ఏర్పాటు (మిగతా...2లో)

మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

ఏడో రోజు 57 నామినేషన్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఏడో రోజు బుధవారం మొత్తంగా 57 నామినేషన్లు దాఖలయ్యాయి. శ్రీకాకుళం పార్లమెంట్ స్థానానికి తొమ్మిది, ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు 48 నామినేషన్లు వచ్చాయి. శ్రీకాకుళం పార్లమెంట్ స్థానానికి టిడిపి అభ్యర్థి కింజరాపు రామ్మోహన్ నాయుడు నామినేషన్ వేశారు. డమ్మీ అభ్యర్థిగా ఆయన తల్లి కింజరాపు విజయకుమారి నామినేషన్ దాఖలు చేశారు. వైసిపి అభ్యర్థి పేరాడ తిలక్ నామినేషన్ వేశారు. భారత్ చైతన్య యువజన పార్టీ అభ్యర్థి బోరుభద్ర చంద్రకళ, పిరమిడ్ పార్టీ నుంచి బొమ్మాళి తిరుపతిరావు, స్వతంత్ర అభ్యర్థి వాబ యోగి నామినేషన్లను దాఖలు చేశారు. కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి మనజీర్ జిలానీ సమూన్‌కు తమ నామినేషన్ పత్రాలను అందజేశారు. ఇచ్ఛాపురం అసెంబ్లీ స్థానానికి ఇండియా ఫోరం బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి పసుపర్తి చక్రవర్తిరెడ్డి నామినేషన్ వేశారు. టిడిపి అభ్యర్థి బెందాళం అశోక్, డమ్మీ అభ్యర్థిగా ఆయన సతీమణి బెందాళం నీలోత్పల నామినేషన్ దాఖలు చేశారు. వైసిపి అభ్యర్థి పిరియా విజయ, డమ్మీ అభ్యర్థిగా పిరియా సాయిరాజ్ నామినేషన్ వేశారు. బిసివై అభ్యర్థిగా బడ్డి ముఖలింగం నామినేషన్ వేశారు. పలాస అసెంబ్లీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థులు దట్టి రాజేశ్వరి, వెంకటరమణమూర్తి కరికర్ణి నామినేషన్లు దాఖలు చేశారు. జైభారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి అనిల్‌కుమార్ రాజు నామినేషన్ వేశారు.

టెక్కలి అసెంబ్లీ స్థానానికి జైభారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి బైపల్లి పరమేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ డమ్మీ అభ్యర్థిగా కిల్లి విక్రాంత్, వైసిపి అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ నామినేషన్లు వేశారు. పాతపట్నం అసెంబ్లీ స్థానానికి బిఎస్‌పి అభ్యర్థి బొడ్డేపల్లి కృష్ణారావు, స్వతంత్ర అభ్యర్థి ఎ.శంకరరావు, టిడిపి అభ్యర్థి మామిడి గోవిందరావు నామినేషన్లు దాఖలు చేశారు. శ్రీకాకుళం అసెంబ్లీ స్థానానికి ఇండియా ఫోరం బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి అంబటి కృష్ణారావు, వైసిపి అభ్యర్థి ధర్మాన ప్రసాదరావు స్వతంత్ర అభ్యర్థిగానూ మరో నామినేషన్ పత్రాన్ని దాఖలు చేశారు. బిఎస్‌పి అభ్యర్థి గుజ్జల సూర్యనారాయణ, స్వతంత్ర అభ్యర్థి పి.సంతోషమ్మ నామినేషన్లు వేశారు. ఆమదాలవలస అసెంబ్లీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థులు సువ్వారి గాంధీ, సువ్వారి దివ్య, సువ్వారి సత్యనారాయణ, జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ అభ్యర్థి గురుగు రేవతి నామినేషన్లు దాఖలు చేశారు. ఎచ్చెర్ల అసెంబ్లీ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా కె.సింహాద్రి నాయుడు, వైసిపి అభ్యర్థి గొర్లె కిరణ్‌కుమార్, డమ్మీ అభ్యర్థిగా గొర్లె ప్రమీల, బిఎస్‌పి అభ్యర్థి గంట్లాన రామారావు, బిజెపి అభ్యర్థి ఎన్.ఈశ్వరరావు, డమ్మీ అభ్యర్థిగా ఆయన సతీమణి ఎన్.రజని నామినేషన్లు దాఖలు చేశారు. నరసన్నపేట అసెంబ్లీ స్థానానికి జైభారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి చీపురు రవి, వైసిపి అభ్యర్థి ధర్మాన కృష్ణదాస్, డమ్మీ అభ్యర్థిగా ఆయన తనయుడు ధర్మాన కృష్ణచైతన్య, టిడిపి అభ్యర్థి బగ్గు రమణమూర్తి నామినేషన్లను దాఖలు చేశారు.

నేడు తీవ్ర వడగాలులు

శ్రీకాకుళం : జిల్లావ్యాప్తంగా బుధవారం 13 మండలాల్లో తీవ్ర వడగాల్పులు వీచే అవకాశముందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించిందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఒక ప్రకటనలో తెలిపారు. 15 మండలాల్లో వడగాలులు వీచే అవకాశముందని పేర్కొన్నారు.

తీవ్ర వడగాలులు వీచే మండలాలు

ఆమదాలవలస, బూర్జ, జి.సిగడాం, పొందూరు, సరుబుజ్జిలి, నరసన్నపేట, జలుమూరు, టెక్కలి, కోటబొమ్మాళి, సారవకోట, పాతపట్నం, హిరమండలం, ఎల్ఎన్‌పేట.

వడగాలులు వీచే మండలాలు

ఎచ్చెర్ల, ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట, కంచిలి, కొత్తూరు, లావేరు, మందస, మెళియాపుట్టి, నందిగాం, పలాస, పోలాకి, రణస్థలం, సంతబొమ్మాళి, శ్రీకాకుళం.

జిల్లాలో బూర్జ మండలంలో బుధవారం అత్యధికంగా 42.6 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైనట్లు తెలిపారు. 13 మండలాల్లో తీవ్ర వడగాలులు, 12 మండలాల్లో వడగాలులు వీచాయని పేర్కొన్నారు. వీలైనంత వరకు ఉదయం 11 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఇంట్లోనే ఉండాలని తెలిపారు. వృద్ధులు, గర్భిణులు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బాబు వస్తే పథకాలు రద్దు

చంద్రబాబు నాయుడు మూడుసార్లు ముఖ్యమంత్రిగా చేసినా చెప్పుకోవడానికి ఒక్క మంచి పథకమైనా గుర్తొస్తుందా అని ప్రశ్నించారు. మోసాలు, అబద్ధాలు చేసే నాయకుడు కావాలా..?, 99 శాతం హామీలు అమలు చేసిన నాయకుడు కావాలో తేల్చుకోవాలన్నారు. ఎన్నికల్లో మాట ఇవ్వడం, ఆ తర్వాత వాటిని అమలు చేయకపోవడం చంద్రబాబుకి అలవాటు అని విమర్శించారు. రాష్ట్రాన్ని సింగపూర్ చేస్తానని చంద్రబాబు చెప్పారని... టెక్కలి, శ్రీకాకుళంలో అయినా అది కనిపించిందా అని ప్రశ్నించారు.

టెక్కలిలో మార్పుకు అవకాశం ఇవ్వండి

టెక్కలిలో జరుగుతున్న చెడుకు స్వస్తి పలికి, మార్పుకు అవకాశం కల్పించాలని కోరారు. టెక్కలి వైసిపి అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్‌ని పరిచయం చేస్తూ ఆయన ఈ మాటన్నారు. వైసిపిని గెలిపిస్తే దువ్వాడ శ్రీనివాస్‌తో మంచి చేయిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌తో పాటు జిల్లాలో పోటీ చేస్తున్న వైసిపి అభ్యర్థులందరినీ పరిచయం చేశారు. సభలో వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వై.వి సుబ్బారెడ్డి, డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, ఎమ్మెల్యే అభ్యర్థులు తమ్మినేని సీతారాం, ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, దువ్వాడ శ్రీనివాస్, రెడ్డి శాంతి, ధర్మాన కృష్ణదాస్, గొర్లె కిరణ్ కుమార్, పిరియా విజయ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నాయకుల్లో వర్షం టెన్షన్

ముఖ్యమంత్రి సభా వేదిక వద్దకు మరికొద్ది నిమిషాల్లో చేరుకుంటారనగా, ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఆ ప్రాంతం చుట్టూ కారుమబ్బులు కమ్ముకున్నాయి. బలమైన గాలులు సైతం వీయడంతో ఒక్కసారిగా దుమ్ము రేగింది. దీంతో వర్షం వస్తుందేమోనని వైసిపి నాయకులు టెన్షన్‌కు గురయ్యారు. కొద్దిసేపటి తర్వాత గాలులు నిలిచిపోయి, కారుమబ్బులు తొలగిపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. సిఎం ప్రసంగం చివర్లో చిన్నపాటి చినుకులు కురిశాయి.

ట్రాఫిక్ ఇబ్బందులతో జనం అవస్థలు

సిద్ధం సభ సందర్భంగా జాతీయ రహదారిపై పలు వాహనాలు నిలిచిపోయాయి. జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన సభకు జనాలు తరలిరావడంతో తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. సభ ప్రారంభం, ముగింపు తర్వాత ఒక్కసారిగా జనం రోడ్ల మీదకి రావడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సుమారు రెండు కిలోమీటర్ల మేర బస్సులు, లారీలు ఇతర వాహనాలు ఆగిపోయాయి.

సభ సందర్భంగా జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణాలు, టీ టైం సెంటర్‌లు, దాబాలు మూసివేశారు. జిల్లాలోని నాలుగు ఆర్‌టిసి డిపోల నుంచి బస్సులను సిద్ధం సభకు తరలించడంతో, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలకు వెళ్లాల్సిన బస్సులను మళ్లించడంతో అవస్థలు పడ్డారు. ఆటోలు, మ్యాక్సీ క్యాబ్‌లు ప్రయివేట్ వంటి వాహనాలను ఆశ్రయించారు.

జాతీయ రహదారిపై నిలిచిన వాహనాలు

మొదటి పేజీ తరువాయి

పలువురికి అనుమతి నిరాకరణ

సిద్ధం సభ కోసం వివిపి పాస్‌లు జారీ చేసినా, పోలీసులు సభాస్థలిలోకి విడిచిపెట్టకపోవడంతో చాలామంది నాయకులు సభ బయటే ఉండిపోయారు. టెక్కలి సర్పంచ్ గొండేల సుజాత, ఎంపిటిసి పీత హేమలత, నాయకులు ధవళ కృష్ణారావు వంటి వారికి లోపలకు పంపేందుకు పోలీసులు నిరాకరించారు. గ్యాలరీలో జనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో స్వల్పంగా తోపులాట చోటుచేసుకుంది.

మహిళాభివృద్ధికే 'సూపర్ సిక్స్'

ప్రతి ఇంటికీ ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇస్తామని, ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామని హామీనిచ్చారు. అమ్మకు వందనం ద్వారా ఇంట్లో ఎంతమంది చదువుకుంటున్న పిల్లలు ఉంటే వారందరికీ రూ.15 వేలు ఆర్థికసాయం అందిస్తామన్నారు. డ్వాక్రా సంఘాలకు రూ.10 లక్షల వడ్డీ లేని రుణాలు ఇస్తామన్నారు. తాము అధికారంలోకొస్తే రెండు, మూడు సెంట్ల స్థలమిచ్చి ఇళ్లు కట్టిస్తామని హామీనిచ్చారు. తాను మహిళా పక్షపాతినని, తన హయాంలో మహిళల అభివృద్ధి, సాధికారత, ఆర్థిక స్వావలంబనకు అనేక సంక్షేమ పథకాలను తీసుకొచ్చామన్నారు. టిడిపి ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన డ్వాక్రా సంఘాల వ్యవస్థ ఇప్పుడు సత్ఫలితాలు ఇస్తున్నాయని చెప్పారు.

ఐదేళ్ల వైసిపి పాలనలో మహిళల జీవితాలు తలకిందులయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు ఛార్జీలు, నిత్యావసర సరుకుల ధరలు పెరిగి పేద, మధ్యతరగతి ప్రజలు బతకలేని పరిస్థితిని తీసుకొచ్చారని ధ్వజమెత్తారు. అసమర్థ జగన్ పాలనలో ప్రతి కుటుంబానికీ ఖర్చులు పెరిగాయని, ఆదాయం తగ్గిందన్నారు. సంపూర్ణ మద్య నిషేధం హామీనిచ్చి, మద్యం ధరలు పెంచుకుంటూ రూ.లక్షల కోట్లు కొల్లగొట్టి కుటుంబాలను గుల్ల చేశారన్నారు. నాశిరకం మద్యంతో అనారోగ్యం పాలైన వారు, మృతి చెందిన వారూ ఉన్నారని చెప్పారు. ఆ కుటుంబాల్లో విషాదాన్ని నింపారన్నారు. వైసిపి పాలనలో ఒక్క అభివృద్ధి పని లేదని విమర్శించారు. జిల్లాలో ఎక్కడైనా రోడ్డు నిర్మాణం చేశారా అని ప్రశ్నించారు. మే 13న జగన్‌కు దిమ్మదిరిగే తీర్పునివ్వాలని కోరారు.

జిల్లా అభివృద్ధి బాధ్యత తీసుకుంటా

శ్రీకాకుళం జిల్లాను అభివృద్ధి చేసే బాధ్యతను తాను తీసుకుంటానన్నారు. మత్స్యకారుల కోసం మినీ జెట్టీలు ఏర్పాటు చేస్తానని, కోడి రామ్మూర్తి స్టేడియం నిర్మాణం పూర్తి చేస్తానని హామీనిచ్చారు. పాలకొండ రోడ్డు, ఔటర్ రింగు రోడ్డు నిర్మిస్తామన్నారు. శ్రీకాకుళం నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఇతర సమస్యలను పరిష్కరిస్తానన్నారు.

ఐవిఆర్‌ఎస్‌లో రామ్మోహన్ నాయుడు ఫస్ట్

టిడిపి అభ్యర్థుల కోసం నిర్వహించిన ఐవిఆర్‌ఎస్ సర్వేలో కింజరాపు రామ్మోహన్ నాయుడు రాష్ట్రంలోనే ఫస్ట్ వచ్చారని చంద్రబాబు తెలిపారు. ఆయనకు టిక్కెట్ ఇవ్వాలంటే తనను అడ్డుకునే వారు ఎవరూ లేరని కానీ, జనామోదం ఉన్న వారికే టిక్కెట్లు ఇవ్వాలని తీర్మానించుకున్నామన్నారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్‌కు టిక్కెట్ ఇవ్వాలనే ప్రతిపాదన వచ్చిన తర్వాత సర్వే నిర్వహిస్తే ఆయనకు జనాదరణ ఎక్కువగా ఉందని తేలిందన్నారు. వారిద్దరినీ ఆశీర్వదించాలని కోరారు. వారిని చట్టసభలకు పంపించే బాధ్యత మహిళలదేనన్నారు. జిల్లాకు పట్టిన కేన్సర్ ధర్మాన అని విమర్శించారు. సమావేశంలో ఎంపీ రామ్మోహన్ నాయుడు, టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్, శ్రీకాకుళం అభ్యర్థి గొండు శంకర్, బిజెపి, జనసేన జిల్లా అధ్యక్షులు బి.ఉమామహేశ్వరరావు, పి.చంద్రమోహన్, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షులు తమ్మినేని సుజాత, గొండు స్వాతి తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

రుసుము విధించడంతో పాటు చర్యలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు. తనిఖీల్లో డాక్టర్ సి.పి శ్రీదేవి, ఆర్‌బిఎస్‌కె జిల్లా సమన్వయకర్త జె.వి లక్ష్మి, డిపిఎంఒ పైడి వెంకటరమణ, డిప్యూటీ డెమో మహంతి వెంకటేశ్వరరావు, సూర్యకళ, మోహిని పాల్గొన్నారు.

కూల్ అయిన 'కలమట'

పదవిని కలమటకు ఇవ్వాలని చంద్రబాబును కోరారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు వల్లే తనకు టిక్కెట్ రాలేదని ఆరోపించిన కలమట, ఆయన సమక్షంలోనే చంద్రబాబును కలవడం, బుధవారం ఎంపీ రామ్మోహన్ నాయుడు నామినేషన్ కార్యక్రమంలో ఆయనతోనే కలిసి పాల్గొన్నారు. ఆయనకు పార్టీ జిల్లా పగ్గాలు కేటాయించే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

రేపు నామినేషన్ల పరిశీలన

చేయాలన్నారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ చేపడుతున్నట్లు చెప్పారు. ఈనెల 24వ తేదీ రాత్రికి కొత్తగా ఓటు నమోదు, బదిలీకి సంబంధించిన దరఖాస్తులను పరిష్కరించనున్నట్లు తెలిపారు. సప్లిమెంటరీ ఓటరు జాబితా ముద్రణకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. వచ్చే నెల 4వ తేదీన ఎన్నికల కమిషన్ వీడియో కాన్ఫరెన్స్ ఉందని, అధికారులు సంబంధిత నివేదికలతో సిద్ధంగా ఉండాలని చెప్పారు.

ఈనెల 27, 28 తేదీల్లో ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి ఆర్డర్లు అందజేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఆర్‌ఒలు నూరుల్ కమర్, భరత్ నాయక్, సిహెచ్ రంగయ్య, లక్ష్మణమూర్తి, రామ్మోహన్, సుదర్శన్ దొర, అప్పారావు. ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ, సిపిఒ ప్రసన్నలక్ష్మి, జిల్లా ఆడిట్ అధికారి సుల్తానా, డిటిసి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు, డిపిఒ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మరింత అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

సాధారణ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, కంట్రోల్ రూమ్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ బుధవారం పరిశీలించారు. ఆయా విభాగాల్లో చేయాల్సిన మార్పులను అధికారులకు సూచించారు. ఎన్నికల సమయం దగ్గర పడుతున్న తరుణంలో మరింత అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని ఆదేశించారు. సిసి కెమెరాలో మద్యం నిల్వల కేంద్రాన్ని, వాటి సరఫరా జరుగుతున్న తీరును ఎస్ఇబి అధికారులతో కలిసి పరిశీలించారు. కాల్ సెంటర్, సి-విజిల్‌కు వస్తున్న ఫిర్యాదులు, వాటిపై తీసుకున్న చర్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు సిపిఒ ప్రసన్నలక్ష్మి, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, హౌసింగ్ పీడీ గణపతిరావు, సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు, డిఐపిఆర్ఒ కె.చెన్నకేశవరావు, డిపిఒ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

మహారాజశ్రీ శ్రీకాకుళం ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో
IA.235/2005 in OS.125/1984

Between:
సాదు చిన్నమ్మి (Dide) మరియు ఇతరులు
...పిటిషనర్/వాదులు

And:-
సాదు జంగాలు(Dide) మరియు ఇతరులు
...రెస్పాండెంట్స్/ప్రతివాదులు

To,
R-6: పోదిలేపు చిన్నమ్మి, భర్త లేటు గారయ్య, 65 సం॥, గృహిణి, నివాసం బలగ, శ్రీకాకుళం పట్టణం, శ్రీకాకుళం మున్సిపాలిటీ, శ్రీకాకుళం జిల్లా.

పై నెంబరు గల దావాలో మీరు 6వ ప్రతివాది, రెస్పాండెంట్ అయివున్నారు. పై కోర్టు వారు మీకు నోటీసులు నిమిత్తం తేది **09-5-2024**న **మీ హాజరు నిమిత్తం వాయిదా వేసి యున్నారు. సదరు పైన తెలిపిన తేదిన 10:30 ని॥లకు** సదరు కోర్టు వారి ముందు స్వయంగా గానీ, వకీలుగారి ద్వారా గానీ హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియచేసుకొనవలెను. లేని యెడల శ్రీకోర్టు వారు మీపరోక్షమున తీర్మానించడం జరుగును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
పేరూరి నాగేశ్వరరావు
పిటిషన్ తరుపు న్యాయవాది,
శ్రీకాకుళం, సెల్ నెంబర్: 9848950706.

సరదాల మాటున ప్రమాదాలు

ప్రజాశక్తి- రణస్థలం

పాఠశాలలకు వేసవి సెలవులు ఇస్తున్నారు. దీంతో విద్యార్థులు పుస్తకాలను విసిరేసి ఆటలకు పరుగులు తీస్తున్నారు. ఇటువంటి వారిపై తల్లిదండ్రులు పరిశీలించకుంటే ముప్పు తప్పదని వైద్య, విజ్ఞాన నిపుణులు పేర్కొంటున్నారు. సరదాల మాటున పొంచి ఉన్న ప్రమాదాలు వారికి అర్థమయ్యేలా వివరించాలి. వాటి నుంచి వారికి రక్షించాలి. పిల్లల ఆహారం చదువు విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు. పిల్లల సంరక్షణ, తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై ప్రజాశక్తి అందజేస్తున్న ప్రత్యేక కథనం.

వీటి జోలికి వెళ్లనీయద్దు

గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులు, కాలువలు, నదుల వైపు వెళ్లకుండా ఈతలకు వెళ్లకుండా చేయాలి. రోడ్డెక్కితే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. సెలవు దొరికింది కదా అని పలువురు విద్యార్థులు రోడ్లపైనే సంచరిస్తుంటారు. ఎండలో తిరుగుతుంటారు. దీంతో వారు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. ఇంట్లో ఖాళీ సమయంలో కంప్యూటర్, వీడియో గేమ్‌లు, టీవీలకు అతుక్కు పోవటంవలన దృష్టి లోపాలతో పాటు మానసిక బలహీనంగా తయారవుతారు. తస్మాత్.. జాగ్రత్త.

జాగ్రత్తలు తీసుకోవాలి

సెలవుల్లో పిల్లలను అవసరమైతే తప్ప బయటకు పంపవద్దు. వారికి ఇంట్లోనే అత్యధికంగా కేటాయించిన సమయంలో వీలును బట్టి తల్లిదండ్రులు తమ పిల్లలతో అధిక సమయాన్ని కేటాయించాలి. ఖాళీ సమయాల్లో నిత్యం చదివే పుస్తకాలు కాకుండా విజ్ఞానదాయకమైన పుస్తకాలు చదివేలా ప్రోత్సహించాలి. పిల్లలు ఇంటి నుంచి బయటకు వెళ్లాల్సివచ్చినప్పుడు సమాచారం ఇచ్చి వెళ్లేలా జాగ్రత్తలు తల్లిదండ్రులు చెప్పాలి. మధ్యాహ్నం భోజనం అనంతరం గంట తరువాత పాలు, కొబ్బరి నీరు, పండ్ల రసాలు వంటి ద్రవ్యాలు వారికి అందజేయాలి. లేతవర్ణ వస్త్రాలు ధరించేలా చూసుకోవాలి.

జ్వరం వస్తే...

జ్వరం వస్తే వదులుగా ఉన్న దుస్తులు వేయాలి. అలాగే తడి గుడ్డతో శరీరాన్ని తుడవాలి. వైద్యుల సూచనల మేరకు మాత్రలు, సిరప్ వాడాలి, ఐస్ లేని ద్రవ పదార్థాలు తీసుకోవటం మంచిది. ఎండలు తీవ్రంగా ఉన్నట్లయితే మాంసాహారానికి దూరంగా ఉండటం మంచిది. రోజుకు మూడు లీటర్ల నీటిని తాగించాలి. తల్లిదండ్రులే బాధ్యతగా బయటకు తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలి.

సూపర్ సిక్స్ పథకాలపై మహిళకు అవగాహన కల్పిస్తున్న రాజు

'సూపర్ సిక్స్'పై ప్రచారం

ప్రజాశక్తి- ఆమదాలవలస

టిడిపి, బిజెపి, జనసేన కూటమి గెలుపుతోనే రాష్ట్ర భవిష్యత్ మెరుగు పడనుందని టిడిపి మండల నాయకులు నూక రాజు, సనపల ఢిల్లేశ్వరరావు, తమ్మినేని చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని గాజుల కొల్లివలసలో బాబూ ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి పోస్టర్లను పంపిణీ చేస్తూ సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న కూన రవికుమార్, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కింజరాపు రామ్మోహన్ నాయుడులను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అన్నెపు భాస్కరరావు, నవిరి చిన్నారావు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకుందాం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మే 13న జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఉద్యోగులంతా పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలని ఎపి ఎన్‌జిఒ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తం నాయుడు, జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం, జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా శ్రీను పిలుపునిచ్చారు. ఓట్ ఫర్ ఎ బెటర్ నేషన్ పేరిట ప్రజా చైతన్యార్థం నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ఎన్నికలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నరసన్నపేట నియోజకవర్గంలోని వైసిపి సీనియర్ నాయకులు, పోలాకి మాజీ ఎంపిపి తమ్మినేని భూషణరావు పార్టీని వీడి చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరారు. బుధవారం జిల్లా పర్యటనలో ఉన్న చంద్రబాబును పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తితో పాటు కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు చంద్రబాబు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్, మాజీ డిసిసిబి చైర్మన్ డోల జగన్, జలుమూరు జెడ్‌పిటిసి ప్రతినిధి మెండ రాంబాబు, సర్పంచ్, వెలమ కార్పొరేషన్ చైర్మన్ ప్రతినిధి పంగ బావాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన భూషణరావు

కాంగ్రెస్‌లో 80 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి- లావేరు

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఎచ్చెర్ల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కరిమజ్జి మల్లేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని వెంకటాపురంలో మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో 80 కుటుంబాలు వైసిపిని వీడి కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి మల్లేశ్వరరావు కాంగ్రెస్ పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వెంకట్ నాయుడు, లక్మణరావు, దొరడ్ల అనిల్‌కుమార్, చింతాడ గొల్ల, దొరడ్ల రాము, లంక బంగారి, చింతాడ తవుడు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో చేరిన వారితో మల్లేశ్వరరావు

మండుటెండలో ప్రయాణికుల అవస్థలు

అంబేడ్కర్ కూడలిలో తలపై కొంగులు కప్పుకొని నిల్చొన్న మహిళలు

ప్రజాశక్తి- పొందూరు

ఒక పక్క సిద్ధం సభలకు బస్సులు, మరో పక్క నామినేషన్లుకు ఆటోలు వంటి వాహనాలు తరలివెళ్లడంతో దూరప్రాంతాలకు ప్రయాణాలు సాగించే ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. నడినెత్తిపై భానుడు భగభగా మండుతున్నాడు అయినా తప్పనిసరి పరిస్థితుల్లో అత్యవసర ప్రయాణాలు సాగించాల్సి వస్తున్నా అవసరమైన వాహనాలు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. బుధవారం మండల పరిధిలోని ఏ కూడలి చూసినా ప్రయాణికులు మండుటెండల్లో వాహనాల కోసం నిరీక్షిస్తూ తీవ్ర అవస్థలు పడ్డారు. జిల్లాలో జరుగుతున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం సభలకు ఆర్‌టిసి బస్సులను తరలించారు. అలాగే పలు నియోజకవర్గాల్లో జరిగిన నామినేషన్ల కార్యక్రమానికి గ్రామాల్లో ఆటోలు తరలివెళ్లిపోయాయి. దీంతో వాహనాలు లేకపోవడంతో పెళ్లిళ్లకు, శుభకార్యక్రమాలకు వెళ్లేవారు వడగాల్పులతో రహదారులపై వాహనాల కోసం వేచిచూశారు. ఈ విధంగా మొత్తం వాహనాలన్నింటిని తరలించడంపై పలువురు అసహనాన్ని వ్యక్తం చేశారు.

దేవీ ఆశ్రమంలో చోరీ

- సిసి కెమెరాలు ధ్వంసం
- ఆభరణాలు అపహరణ

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారిగా పూజలందుకుంటున్న దేవీ ఆశ్రమంలో దొంగలు పడి ఆభరణాలు అపహరించిన ఘటన ఈ ప్రాంతంలో కలకలం రేపుతుంది. అనునిత్యం భక్తుల రద్దీతో ఉన్న ఈ ఆలయంలో అమర్చిన సిసి కెమేరాలు, ఫుటేజ్‌తో భద్రపర్చిన బాక్సులను ధ్వంసం చేసి దుండగలు ఓ పథకం ప్రకారమే ఆలయ గ్రిల్స్, తాళాలు తొలగించి ఈ ఘటనకు పాల్పడ్డారు. మండలంలోని కుంచాల కురమయ్యపేటలో ఉన్న దేవీ ఆశ్రమంలో మంగళవారం రాత్రి ఈ చోరీ జరిగిందని ఆలయ వ్యవస్థాపకులు తేజోమూర్తుల బాల భాస్కరశర్మ స్పష్టం చేశారు. ప్రస్తుతం దేవి పీఠంలో కోటిలింగార్చన పూజలు నిర్వహిస్తున్నారు. మంగళవారం1.30 గంటల వరకు ప్రత్యేక పూజలు నిర్వహించి. ఆలయాన్ని మూశారు. మళ్లీ బుధవారం అర్ధరాత్రి 3.30 గంటలకు ప్రత్యేక పూజ కోసం ఆలయం తలుపులు తెరవగా చోరీ జరిగినట్టు గుర్తించారు. సమాచారం తెలిసిన వెంటనే స్పెషల్ బ్రాంచి పోలీసు అధికారులు, క్లూస్‌టీమ్ సిబ్బంది దేవీ ఆశ్రమానికి చేరుకొని దుండగలు అపహరించిన ఆభరణాలు, నగదు వివరాలు సేకరించారు. అలాగే ఆలయ గర్భాలయంలో క్లూస్ టీమ్ మరిన్ని వివరాలు సేకరించారు. మంగళవారం పౌర్ణమి పూజలు కావడంతో అమ్మవారికి అలంకరించిన సుమారు 30 తులాల బంగారం, వంద తులాల వెండితో పాటు హుండీలో భక్తులు సమర్పించిన రూ.2లక్షలు నగదు కూడా అపహరణకు గురైందని ఆలయ నిర్వాహకులు పోలీస్ సిబ్బందికి స్పష్టం చేశారు. అంతేకాకుండా అమ్మవారికి ఆభరణాలతో పాటు పూజలు నిమిత్తం భక్తులు అందజేసిన సుమారు రూ.40 లక్షల నగదు కూడా గర్భగుడిలోనే భద్రపర్చామని, నగదును కూడా దుండగలు అపహరించినట్టు బాల భాస్కరశర్మ పేర్కొన్నారు. చుట్టూ నివాసాలు ఉన్నప్పటికీ దుండగులు ఓ పథకం ప్రకారమే ఈ చోరీకి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. బాలుస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆధారాలను సేకరిస్తున్న క్లూస్ టీం

కాటమ్మతల్లి ఆలయంలో చోరీ

ప్రజాశక్తి- పలాస

మండలంలోని తర్లకోట కాటమ్మ తల్లి ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయం తలుపులు పగలగొట్టి హుండీలో ఉన్న డబ్బులను గుర్తు తెలియని దుండగులు చోరికి పాల్పడ్డారు. పూజారి ఉదయం ఆలయం తలుపులు తెరిచి చూసేసరికి తాళం పగలుకొట్టి హుండీలో డబ్బులు దోచుకున్నారన్న విషయం గుర్తించి ఆలయ కమిటీ సభ్యులకు సమాచారం అందించారు. వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కాశీబుగ్గ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దర్శించుకుంటున్న రామ్మోహన్ నాయుడు కుటుంబసభ్యులు

కొత్తమ్మతల్లి సందర్శన

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మతల్లిని ఎంపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్‌నాయుడు దంపతులు, కుటుంబ సభ్యులు బుధవారం దర్శించుకున్నారు. టిడిపి ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ వేసేందుకు ముందుగా కొత్తమ్మతల్లిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో రామ్మోమోహన్ నాయుడు తల్లి విజయ మాధవి, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, బోయిన రమేష్, వెలమల కామేశ్వరరావు, విజయలక్ష్మి, తర్ర రామకృష్ణ, పూజారి, శైలజ, దేవాది, సింహాద్రమ్మ పాల్గొన్నారు.

నామినేషన్ వేస్తున్న అనిల్‌రాజు

పలాసలో మూడు నామినేషన్లు

పలాస: పలాస తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం మూడు నామినేషన్లు వేశారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ భరత్ నాయక్ తెలిపారు. జై భారత్ నేషనల్ పార్టీ నుంచి జి.అనిల్‌రాజు, స్వతంత్ర పార్టీ నుంచి దట్టి వీరాస్వామి, కర్ని వెంకటరమణమూర్తిలు నామినేషన్ వేశారని అన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

పలాస: పలాస టిడిపి కార్యాలయంలో బుధవారం టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి సమక్షంలో మందస మండలం రాయికోల, భాతుపురానికి చెందిన వైసిపి నాయకులు టిడిపిలో చేరారు. వీరికి టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ధర్మారావు,గణపతి, విజయ్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తాతారావు, దాసరి జయలక్ష్మి, సవర లఖియా, మోహన్ బాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

పలాస: పదో తరగతి ఫరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ ఫలితాలు సాధించారని పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాట్ల దాశరథి అన్నారు. పాఠశాలలో 250 మంది విద్యార్థులకు గాను 211 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఈ మేరకు ప్రతిభకనబరిచిన విద్యార్థులకు బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో తమ్మినేని చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

అభినందిస్తున్న హెచ్‌ఎం దాశరథి

పదవి వద్దు... ప్రాజెక్టు ఇవ్వండి

నారాయణపురం ఆనకట్టకు పాపారావు పేరు చిరస్థాయి కీర్తి

ప్రజాశక్తి- ఆమదాలవలస

నేటి కాలంలో మంత్రి పదవి కావాలా.. రైతులకు ఉపయోగపడే ప్రాజెక్టు కావాలా అంటే ఠక్కున మంత్రి పదవి పైనే ఆసక్తి కనబరిచే నాయకులే ఎక్కువ. అయితే తమ్మినేని పాపారావు పేరు వింటే నిజాయితీ.. రైతులపై మమకారం మనకు ఎక్కువగా కనిపిస్తుంది. తనకు పదవి తృణప్రాయం.. రైతుకు సాగునీరు అందించి లాభం చేకూర్చాలని చెప్పి రాజకీయ నాయకులకే ఆదర్శంగా నిలిచి రైతుల గుండెల్లో చోటు సంపాదించుకున్నారు. నిలిచారు మాజీ ఎమ్మెల్యే, కీర్తిశేషులు తమ్మినేని పాపారావు.. తన ఆశయాన్ని నాటి పాలకుల దృష్టికి తీసుకువచ్చి నారాయణపురం ఆనకట్ట నిర్మాణం చేపట్టి ఈ ప్రాంతంలో 38 వేల ఎకరాలకు సాగునీరందించిన ఘనత ఆయనదే.. రైతు బాంధవుడిగా పేరుపొందిన తమ్మినేని పాపారావు పేరు చిరస్థాయిగా నిలవాలన్న ఉద్దేశంతో మాజీ ఎమ్మెల్యే కూన రవికుమార్ తమ్మినేని పాపారావు నారాయణపురం ఆనకట్టగా ప్రకటించేందుకు పాటుపడ్డారు. నియోజకవర్గంలో భావితరాల రాజకీయ నేతలకు ఆదర్శంగా నిలిచి కుటుంబ రాజకీయ వారసులకు రాజకీయ భవిష్యత్ అందించిన మహనీయుడు పాపారావు.

ఎచ్చెర్లలో భారతిదే రికార్డు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

ఎచ్చెర్ల శాసనసభ నియోజకవర్గంలో ఇప్పటి వరకూ నిర్వహించిన ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ సాధించిన అభ్యర్థిగా ప్రతిభాభారతి నిలిచింది. మొత్తం 11 సార్లు ఎన్నికలు జరిగాయి. 1983లో జరిగిన ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీ అభ్యర్థిగా కావలి ప్రతిభాభారతి పోటీ చేసింది. ఆ ఎన్నికల్లో ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి నారాయణపై 45,286 ఓట్ల మెజారిటీ సాధించింది. ఆ తర్వాత కాలంలో వరుసగా మరో నాలుగుసార్లు ఎన్నికైనప్పటికీ ఆ స్థాయి మెజారిటీని తీసుకురాలేదు. ఇప్పటికీ ఆమె రికార్డే మెజారిటీగా మారింది. ఇక అత్యల్ప మెజారిటీ నడిమింటి అప్పలనర్సయ్యానాయుడు ఎన్నికయ్యారు. ఎచ్చెర్ల నియోజకవర్గం ఆవిర్భవించిన 1967లో అప్పలనర్సయ్యానాయుడు 2,898 ఓట్ల మెజారిటీతో ప్రత్యర్థి బల్లాడ హరియప్పడురెడ్డిపై గెలుపొందారు. కాగా, 2024 ఎన్నికల్లో ఎవరికి మెజారిటీ అందిస్తారో వేచిచూడాలి.

కావలి ప్రతిభాభారతి

ప్రచారం చేస్తున్న రెడ్డి శాంతి

కోదూరులో రెడ్డి శాంతి ప్రచారం

ప్రజాశక్తి- పాతపట్నం

మండలంలోని కోదూరు పంచాయతీ పరిధిలోని కోదూరు, ప్రహరాజపాలెం గ్రామాల్లో వైసిపి ఎమ్మెల్యే రెడ్డి శాంతి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సిఎం జగన్ అందించిన సంక్షేమ పథకాలను పోస్టర్ల రూపంలో వివరించారు. రాష్ట్రాభివృద్ధి చెందాలంటే జగన్ వల్లే సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలందరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌ను గెలిపించాలని అభ్యర్థించారు.

కార్యక్రమంలో వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్, సర్పంచ్ పనుకు నాగమణి మోహనరావు, ఎస్‌టి సెల్ జిల్లా అధ్యక్షులు గురాడి అప్పన్న, ఎంపిటిసి కొప్పల గీత, ఏనుగుతల సూర్యం, కొండాల అర్జునరావు, తూలుగు ప్రవీణ్, పడాల గోపి, మజ్జి వరదరాజు, గోకవలస రాము, నూలు ఈశ్వరరావు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీలతో మాట్లాడుతున్న మామిడి గోవిందరావు

ఒక్క అవకాశం ఇవ్వండి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మామిడి గోవిందరావు ఓటర్లను కోరారు. మండలంలోని పెద్దపద్మాపురం, చాపర తదితర గ్రామాల్లో శంఖారావంలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. పెద్దపద్మాపురంలో ఉపాధి హామీ కూలీలతో నేరుగా మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో సైకో రెడ్డి పాలనలో అరాచక రాజ్యం ఏలుతుందని విమర్శించారు. దీనిని పారద్రోలాలంటే టిడిపి ప్రభుత్వం రావాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి సలాన మోహనరావు, ఎంపిటిసి ప్రతినిధి నంబాల వెంకటరావు, ఎల్లంనాయుడు, దారపు దామోదర్ పాల్గొన్నారు.

నిరాడంబరంగా విజయ నామినేషన్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం నియోజకవర్గ వైసిపి అభ్యర్థి పిరియా విజయ నిరాడంబరంగా నామినేషన్ వేశారు. ఆమె నామినేషన్ పత్రాన్ని బుధవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుదర్శనదొరను అందజేశారు. పిరియా సాయిరాజ్ డమ్మీ నామినేషన్ దాఖలు చేశారు. మంచి ముహూర్తం కోసం ఒక రోజు ముందుగ వచ్చి ఎటు వంటి ర్యాలీ ప్రదర్శనలు లేకుండా నామినేషన్ దాఖలు చేశారు. గురువారం భారీ ర్యాలీ, కోలాహలం మధ్య మరోసారి నామినేషన్ దాఖలు చేయడానికి ఏర్పాట్లు చేశామని తెలిపారు.

నామినేషన్ వేస్తున్న విజయ

కాలం చెల్లిన నియోజకవర్గాలు

పాత జ్ఞాపకాలుగా మిగిలిన వైనం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

> **భారతదేశానికి స్వాతంత్రం సిద్ధించిన తర్వాత ప్రజాస్వామ్య వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నాం. కాలానుగుణంగా అవసరం మేరకు మార్పులు, చేర్పులు చేసేందుకు, లోపాలను సవరించుకొనేందుకు రాజ్యాంగం వెసులుబాటు కల్పించింది. ఇందులో నియోజకవర్గాల పునర్విభజన ఒకటి. జనాభా పెరుగుదలకు అనుగుణంగా నియోజకవర్గాల పునర్విభజన నిర్ణీత కాలవ్యవధిలో చేస్తుంటారు. ఆ విధంగా కొన్ని నియోజకవర్గాలు చరిత్ర పుటల్లో కలిసిపోతుండగా, మరికొన్ని నియోజకవర్గాలు కొత్త చరిత్రను ఆవిష్కరిస్తున్నాయి.**

జిల్లాలో చరిత్ర పుటల్లో కలిసిపోయిన నియోజకవర్గాలు చాలానే ఉన్నాయి. ఇందులో పొందూరు ప్రముఖమైనది. ప్రజలకు మరింత మెరుగైన సేవలందించడమే నియోజకవర్గాల పునర్విభజన ఉద్దేశ్యమైనప్పటికీ, కొన్నింటి విషయంలో అందుకు విరుద్ధంగా జరుగుతున్నాయని చరిత్ర చెబుతోంది. 1967లో చీపురుపల్లి అసెంబ్లీ స్థానం నుంచి విడిపోయి పొందూరు నియోజకవర్గం ఏర్పాటైంది. 1962లో పొందూరు (ఎస్‌సి) నియోజకవర్గం నుంచి కొత్తపల్లి పున్నయ్య (కాంగ్రెస్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పున్నయ్యకు జిల్లా జడ్జి ఉద్యోగం రావడంతో శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. 1964లో జరిగిన ఉప ఎన్నికలో కొత్తపల్లి నరసయ్య (కాంగ్రెస్) ఎన్నికయ్యారు. 1967లో ఈ నియోజకవర్గం జనరల్ కేటగిరీకి మారింది. ఆ ఎన్నికల్లో చౌదరి సత్యనారాయణ (స్వతంత్ర పార్టీ) గెలుపొందారు. 1972లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో లుకలాపు లక్ష్మణదాసు (కాంగ్రెస్) విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో అప్పటి ఎస్.ఎం.పురం సమితి అధ్యక్షుడు టంకాల అక్కలనాయుడు (ఇండిపెండెంట్), గురుగుబెల్లి స్వామినాయుడు ఓటమి చవిచూశారు. పొందూరు శాసనభ్యునిగా ఎన్నికైన లుకలాపు లక్ష్మణదాసు పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా కూడా వ్యవహరించారు. అటు తరువాత చీపురుపల్లి నుంచి విడదీసి పొందూరులో కొత్తగా తాలుకాను ఏర్పాటు చేశారు. పొందూరు నియోజకవర్గం 18 ఏళ్లకే కనుమరుగైంది. 1978 ఎన్నికల్లో పొందూరు ప్రాంతం చీపురుపల్లి నియోజకవర్గంలో విలీనమైంది. 2004 ఎన్నికల వరకూ పొందూరు, జి.సిగడాం మండలాలు చీపురుపల్లి నియోజకవర్గంలోనే అంతర్భాగంగా ఉండేవి. 2009లో జరిగిన పునర్విభజనలో పొందూరు మండలం ఆమదావలస నియోజకవర్గంలో, మండలం ఎచ్చెర్ల అసెంబ్లీ జి.సిగడాం నియోజకవర్గంలో విలీనమయ్యాయి.

ఎస్.ఎం పురానికి విశిష్టత

జిల్లాలో ఎస్.ఎం పురం గ్రామానికి ఓ విశిష్టత ఉంది. ఈ గ్రామం కొన్నాళ్లపాటు నియోజకవర్గ, సమితి కేంద్రంగా ఉండేది. 1955లో అవతరించిన ఎస్.ఎం.పురం సెగ్మెంట్ 1967లో తెరమరుగైంది. 1955లో జరిగిన ఎన్నికల్లో కృషీకార్ లోక్పార్టీ అభ్యర్థిగా చౌదరి సత్యనారాయణ ఇక్కడి నుంచి ఎన్నికయ్యారు. 1962లో బల్లాడ హరప్పడు రెడ్డి (ఇండిపెండెంట్) ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఈ సెగ్మెంట్ ఎచ్చెర్ల అసెంబ్లీగా రూపాంతరం చెందింది. 1952లో అవతరించిన హోంజరాం అసెంబ్లీ నియోజకవర్గం మూడేళ్లకే కనుమరుగైంది. 1952లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఈ సెగ్మెంట్ నుంచి పీసపాటి పుండరీకక్షాచార్యులు ఎన్నికయ్యారు. ఈ సెగ్మెంట్ పాలకొండలో కలిసిపోయింది. 1955లో అవతరించిన బ్రాహ్మణతర్లా అసెంబ్లీ సెగ్మెంట్ 1967లో అంతరించిపోయింది.

1955లో జరిగిన ఎన్నికల్లో ఈ సెగ్మెంట్ నుంచి కషీకార్ లోక్పార్టీ అభ్యర్థి నిచ్చెర్ల రాములు ఎన్నికయ్యారు. 1962లో జరిగిన ఎన్నికల్లో బెండి లక్ష్మీనారాయణమ్మ ఎన్నికయ్యారు. 1967లో ఈ సెగ్మెంట్ టెక్కలి సెగ్మెంట్‌లో కలిసిపోయింది. అలాగే 1965లో ఏర్పాటైన నగరికటకం సెగ్మెంట్ 1978 వరకూ కొనసాగింది. 1955, 1962, 1967లో తమ్మినేని పాపారావు (కాంగ్రెస్) ఎన్నికయ్యారు. ఆ తర్వాత నగరికటకం నియోజకవర్గం ఆమదావలస నియోజకవర్గంగా ఏర్పాటైంది. 2009 నియోజకవర్గ పునర్విభజనలో జిల్లాలోని హరిశ్చంద్రపురం, ఉమ్మడి జిల్లా ఉణుకూరు, సోంపేట, కొత్తూరు నియోజకవర్గాలు తెరమరుగయ్యాయి. ప్రస్తుతం విజయనగరం జిల్లా ఉణుకూరు నియోజకవర్గం రాజాంగా ఏర్పాడింది. హరిశ్చంద్రపురంలోని కొంత ప్రాంతం టెక్కలిలో, మరికొంత భాగం నరసన్నపేటలో కలిశాయి. సోంపేట నియోజకవర్గంలోని కొంత భాగం కొత్తగా ఏర్పడిన పలాసలో, మరికొంత ప్రాంతం ఇచ్ఛాపురంలో విలీనమైంది. 2009లో జరిగిన పునర్విభజనలో ఉమ్మడి జిల్లాలో 12 అసెంబ్లీ నియోజకవర్గాలు 10 అసెంబ్లీ సెగ్మెంట్లుగా ఏర్పడ్డాయి. 2022లో జిల్లాల విభజనతో ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం, నరసన్నపేట ఆమదాలవలస, శ్రీకాకుళం, ఎచ్చెర్ల నియోజకవర్గాలుగా కొనసాగుతున్నాయి.

కొత్తూరు మండల కేంద్రం వ్యూ

ఏక్ దిన్‌కా.. సుల్తాన్

- ఎన్నికల వేళ ఓటరే రారాజు
- ఐదేళ్ల జీవితానికి సిరా మరక
- విజ్ఞత కొరవడితే ఇక్కట్లే

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఎన్నికల హడావుడి జోరందుకుంది. ప్రచారాల హోరులో అభ్యర్థులు తలమునకలై ఉన్నారు. ఎన్ని దేవుళ్లకు మొక్కినా ఓటరు దేవుడు ఎవరికి వరమిస్తాడో అంతుచిక్కని పరిస్థితి. ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి అభ్యర్థుల పాట్లు అన్నీ ఇన్నీ కావు. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలు, పార్లమెంటు స్థానాల్లో నేతలు ఓటరును తమ వైపునకు తిప్పుకోవడానికి ఎన్నో పాట్లు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఓటరు స్వరూపం.. స్వభావం ఏమిటో చూద్దాం.

పేరు: ఓటరు

ముద్దుపేరు: (నే) తల రాతలు మార్చే బ్రహ్మ. నాయకులు మాత్రం అమాయకపు బ్రహ్మ అనుకుంటారు.

స్వరూపం : ఏక్ దిన్‌కా సుల్తాన్ (ఒక రోజు మహారాజు)

చిరునామా: జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు, పార్లమెంట్ నియోజకవర్గాల్లో నివాసం.

అనుభవం: ఐదేళ్లకు ఒకసారి వచ్చే ఎన్నికల్లో ఓటు వేయడం.

బలహీనతలు: భోళా శంకరుడు, తరచూ మోసపోవడం, మాయ మాటలు నమ్మడం, ప్రలోభాలకు లొంగడం, పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేసేముందు ఆలోచించకపోవడం.

బలం: ఓటు హక్కు ఉండటం, ఐదేళ్లకు ఒకసారి నాయకుల్ని ఓటు రూపంలో ఓడించే శక్తి ఉండటం.

బిరుదులు: కింగ్ మేకర్, ఓటరు దేవుడు, దుష్టశిక్షకుడు, అక్రమార్కుల పని పట్టేవాడు.

లక్షణం: మౌనంగా ఉండటం, ఎవరికీ అంతుచిక్కని నాడి, ఎవరు అడిగినా మీకే మా ఓటు అనడం.

లక్ష్యం: ఐదేళ్ల పాటు పరిపాలించే ప్రభుత్వం కావాలని కోరుకోవడం.

విలక్షణం: ఎవరు ఎంత చెప్పినా.. ఎన్ని తాయిలాలు ఇచ్చినా.. ఎంత ప్రలోభపెట్టినా తనకు నచ్చిన వారికే ఓటు వేయడం.

కోరిక: కూడు, గూడు, గుడ్డ, విద్య, వైద్యం, విద్యుత్, తాగునీరు, రహదారులు వంటి మౌలిక వసతులతో పాటు స్వచ్ఛమైన పరిపాలన అందించి నమ్మకస్తుడుగా ఉండటం. తమ సమస్యలు తీర్చే నాయకుడిని ఎన్నుకోవాలన్న ఆశ.

బాగా ఇష్టం: నిజాయతీ పరులు, సేవ చేసే వారంటే ఇష్టం.

నచ్చనది: ఎన్నికల్లో గెలిచి తనను, తన సమస్యలు పట్టించుకోకుండా పోవడం, అవినీతి, అక్రమాలకు పాల్పడి బాగా సంపాదించే నాయకులు.

వ్యవహారశైలి: ఎప్పటికప్పుడు నేతల వ్యవహారశైలిని నిశితంగా పరిశీలించడం, మౌనంగా తన పని తాను చేసుకుని పోవడం, హేమాహేమీలను మట్టికరిపించడం.

ప్రస్తుత పరిస్థితి: మళ్లీ ఎన్నికలు వచ్చాయి. ఎప్పటిలాగే ఓటరు పరిస్థితి కొనసాగుతోంది. ఎన్ని ప్రభుత్వాలు మారినా మారని దయనీయస్థితి. మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు మరోసారి సిద్ధం.



ఉద్దానం జీడి పంటకు మద్దతు ధర

పలాస టిడిపి అభ్యర్థి గౌతు శిరీష

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్దానం జీడి పంటకు మద్దతు ధర కల్పించి జీడి రైతులను ఆదుకుంటామని కూటమి అభ్యర్థి గౌతు శిరీష అన్నారు. మండలంలోని గరుడభద్రలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీడి, కొబ్బరి పంటల ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుతామని తెలిపారు. ప్రతి చేనుకు నీరు, ప్రతి చేతికి పని నినాదంతో ఎన్నికలకు వెళ్తున్నామని చెప్పారు. వంశధార శివారు రైతులకు సాగునీరు అందించడం, ఉద్దానం జీడి రైతులకు మద్దతు ధర లభించేలా కృషి చేసి ఆదుకోవడమే తమ ముందు ఉన్న లక్ష్యాలు అన్నారు. టిడిపి అభ్యర్థులకు మద్దతుగా ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు సూరాడ మోహనరావు, కోనేరు ఆదినారాయణ, కె.వల్లభం ావు, పి.సాంబమూర్తి, మరడ దుర్యోధన, ఎ.ఉమామహేశ్వరరావు, బి.శశిభూషణ్, రాజశేఖర్, దానయ్య, బత్తిన హేమ, కొంచాడ మోహనరావు, చెక్క లక్ష్మి, ధనుంజయ పాల్గొన్నారు.

మహిళలతో కలిసి ప్రచారం చేస్తున్న గౌతు శిరీష

ఇండియా ఫోరంతోనే అభివృద్ధి

కాంగ్రెస్ అభ్యర్థి త్రినాథ్‌బాబు

ప్రజాశక్తి- పలాస

ఇండియా ఫోరంతోనే అభివృద్ధి సాధ్యమని, అందుకు ఒక్క అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని పలాస కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మజ్జి త్రినాథ్‌బాబు అన్నారు. కాశీబుగ్గ గణపతి లాడ్జిలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. కమ్యూనిస్టు పార్టీలతో జతకట్టి కాంగ్రెస్ పార్టీ ఇండియా ఫోరం బరిలో దిగి దేశంలో బిజెపిని గద్దెదింపడానికి సిద్ధమయ్యాయ న్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే ఉత్తరాంధ్ర లోని శ్రీకాకుళం జిల్లా అభివృద్ధి చెందిందని చెప్పారు. ప్రస్తుతం బిజెపి విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటీక రణ చేసేందుకు సిద్ధమైందన్నారు. వైసిపికి 23 సీట్లు ఇచ్చినా విభజన హామీలపై ఒక్క పోరాటం కూడా చేయలేదని అన్నారు. పలాస నియోజకవర్గంలో ఎన్నో సమస్యలు పరిష్కారం కాకుండా ఉండిపో యాయని పేర్కొన్నారు. దేశంలో ప్రథమ స్థానంలో ఉన్న జీడి పంటకు, కొబ్బరికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేస్తామన్నారు. వంశధార నీరు శివారు ప్రాంతాలకు తీసుకురావడానికి కృషి చేస్తానని అన్నారు. అంపూర్తిగా నిలిచిపోయిన రిజ ర్వాయర్లు పూర్తి చేస్తామని హామీనిచ్చారు. సుదీర్ఘ తీర ప్రాంతం ఉన్న ఈ ప్రాంతంలో కోల్డ్‌స్టోరేజీతో పాటు మన సంపద అభివృద్ధి ఎగుమతిపై నూతన టెక్నాలజీ తీసుకొస్తామని అన్నారు. మందసలో ఐటిడిఎ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. డిఫెన్స్, స్కిల్ డవలప మెంట్ అకాడమితో పాటు వలసలు నివారణకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తామని, అందుకు కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. సమావేశంలో డాక్టర్ జీవితేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోనారి మోహన రావు, సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, కాంగ్రెస్ నాయకులు బమ్మిడి రాజారావు, సీతమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న త్రినాథ్‌బాబు

వలస నాయకుల ఖిల్లా పాతపట్నం

ప్రజాశక్తి- పాతపట్నం

వలస నాయకుల ఖిల్లా పాతపట్నం. నియోజకవర్గం, జిల్లాయేతర నేతలు ఇక్కడ నుంచి ప్రాతినిధ్యం వహించారు. ప్రధాన పార్టీల అభ్యర్థులుగా బరిలో దిగారు. తొలినాళ్లలో పాతపట్నం ద్విసభ్య స్థానం నుంచి ఎంపీగా పోటీచేసిన వి.వి.గిరి కేంద్ర మంత్రిగా కూడా వ్యవహరించారు. తరువాత రాష్ట్రపతిగా ఎంపికయ్యారు. అటు తరువాత ఎచ్చెర్ల మండలానికి చెందిన గొర్లె హరిబాబునాయుడు పాతపట్నం నుంచి రెండుసార్లు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఎచ్చెర్ల ఎస్‌సిలకు రిజర్వ్ కావడంతో పాతపట్నం నుంచి ఆయన పోటీ చేయాల్సి వచ్చింది. కానీ, ఈ రెండుసార్లు హరిబాబునాయుడు టిడిపి అభ్యర్థి కలమట మోహనరావు చేతిలో ఓటమి చవిచూశారు. 1994 ఎన్నికల్లో కలమట మోహనరావు టిడిపి అభ్యర్థిగా గెలిచినా... కృష్ణుడి రూపంలో ఉన్న ఎన్‌టిఆర్ చిత్రపటంతో ప్రచారం చేయడంతో ఎన్నికల నియమావళి ఉల్లంఘించారని ప్రత్యర్థి ఫిర్యాదు చేయడంతో... ఆయన ఎన్నిక రద్దయ్యింది. దీంతో ఉప ఎన్నిక జరుగగా ఎన్‌టిఆర్ సతీమణి లక్ష్మీపార్వతి ఎన్‌టిఆర్ తెలుగుదేశం పార్టీ తరుపున పోటీచేసి... టిడిపి అభ్యర్థి కలమట వేణమ్మపై విజయం సాధించారు. అటు తరువాత 2009 ఎన్నికల్లో శత్రుచర్ల విజయరామరాజు పోటీచేసి కలమట వెంకటరమణపై గెలుపొందారు. ప్రస్తుత ఎమ్మెల్యే రెడ్డి శాంతి కూడా స్థానికేతరురాలే.

రెడ్డి శాంతి

విజయరామరాజు

లక్ష్మీపార్వతి

సిఐటియులోకి విలీన పంచాయతీల కార్మికులు

సిఐటియులో చేరిన మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరపాలక సంస్థ పరిధిలో విలీన పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులు, నగరపాలక సంస్థలో కార్మికులుగా పని చేస్తున్న కార్మికులు ఎఐటియుసి నాయకత్వాన్ని వీడి సిఐటియులో చేరారు. బుధవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) సమావేశం జరిగింది. ఈ సమావేశాంలో వారంతా హాజరయ్యారు. ఎఐటియుసిలో నాయకత్వ బాధ్యతల్లో ఉన్న మాడుగుల రాఘవ, అర్జి జ్యోతిప్రసాద్, ఆర్జి కూలవతి, జలగొడుగుల గోవిందమ్మ, కోన ప్రసాద్, ముంజేటి తిరుమలరావు, భూషణరావు, పైడిరాజులను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అరుగుల గణేష్, నల్లపల్లి బలరాం సిఐటియు కండువాలు వేసి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాఘవ, జ్యోతిప్రసాద్ మాట్లాడుతూ సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా యూనియన్ చేపడుతున్న పోరాటాల వలన కార్మిక సమస్యలు పరిష్కార మయ్యాయన్నారు. అందువల్లే సిఐటియు నాయకత్వాన పని చేసేందుకు చేరడం జరిగందన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులపై పనివారం తగ్గించాలని, మున్సిపల్ కార్పొరేషన్ విస్తీర్ణ పరిధి పెరిగిందని, దానికి తగినట్లుగా పారిశుద్ధ్య కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా కోశాధికారి అల్లు సత్యనారాయణ, నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు గురుస్వామి పాల్గొన్నారు.

స్కిప్పింగ్‌తో సంపూర్ణ ఆరోగ్యం

స్కిప్పింగ్‌పై అవగహన కల్పిస్తున్న వాకర్స్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పిల్లల్లో శారీరక, మానసిక ఉల్లాసానికి, శారీరిక శ్రమను ప్రోత్సహించేందుకు స్కిప్పింగ్ ఎంతో తోడ్పడుతుందని స్టార్‌వాకర్స్ క్లబ్ ప్రతినిధులు జి.ఇందిరా ప్రసాద్, ఎస్.జోగినాయుడు, బి.వి.రవిశంకర్ అన్నారు. బుధవారం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో జాతీయ స్కిప్పింగ్ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్కిప్పింగ్ పోటీల్లో పాల్గొనే పిల్లలకు, పెద్దలకు జాతీయ స్థాయి స్కిప్పింగ్ క్రీడాకారుడు సనపల సారథి సౌజన్యంతో సమకూర్చిన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వయసుతో నిమిత్తం లేకుండా అందరూ విధిగా వ్యాయామం, యోగా తరహాలో స్కిప్పింగ్ చేయటం వల్ల గుండెపోటు రాదని, శరీరం ఫిట్‌గా ఉంటుందన్నారు. విద్యార్థి దశ నుంచే ప్రతిఒక్కరూ స్కిప్పింగ్‌ను ఆటలో భాగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌పి కార్యాలయ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సోమశేఖర్, ఎస్. అనిల్, స్కిప్పింగ్ క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు. సుమారు గంటపాటు సాగిన స్కిప్పింగ్ పోటీల్లో వంద మంది విద్యార్థులు, నడక సంఘాల సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు. విజేతలను వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ మాజీ గవర్నర్ పి జి గుప్తా అభినందించారు.

సిఎం సమక్షంలో పార్టీలో చేరిన టిడిపి నాయకులు

సిఎం సమక్షంలో వైసిపిలో చేరిక

ప్రజాశక్తి- రణస్థలం

ఎచ్చెర్ల మండలం అక్కివలస నైట్ స్టే పాయింట్ వద్ద ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి సమక్షంలో టిడిపి పార్టీ నుంచి వైసిపిలో చేరారు. పార్టీలో చేరిన వారికి సిఎం కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో రణస్థలం ఎంపిటిసి మజ్జి గౌరి, టిడిపి ఉపాధ్యక్షుడు మజ్జి రమేష్ ఉన్నారు. గతంలో టిడిపి నుంచి వైసిపిలో చేరిన రణస్థలం మాజీ ఎంపిపి గొర్లె విజయకుమార్, సీనియర్ నాయకులు డాక్టర్ రామారావు, కార్యకర్తలు లుకలాపు దుర్గారావు, పైడిపల్లి పండు తదితరులు సిఎంను కలిసారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ కో-ఆర్డినేటర్ మజ్జి శ్రీను, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కష్ణదాస్, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, రణస్థలం మాజీ ఎంపిపి గొర్లె పరిమళ పాల్గొన్నారు.

మూడు నామినేషన్ల దాఖలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం మరో మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. ఇండిపెండెంట్ అభ్యర్థులుగా పొందూరు మండలం మాజీ ఎంపిపి సువ్వారి దివ్య, సువ్వారి సత్యనారాయణ, అలాగే పురపాలక సంఘం 6వ వార్డు నాదానపురంకు చెందిన గురుగు రేవతి జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ తరఫున నామినేషన్‌లను రిటర్నింగ్ అధికారి ఎం.నవీన్‌కు సమర్పించారు.

ఇంటింటా ప్రచారం చేస్తున్న వైసిపి నాయకులు

అభివృద్ధి చేశాం.. ఓటు వేయండి

బూర్జ: మండలంలో సింగన్నపాలెం పంచాయతీ పరిధిలో నామాల లక్ష్మీపురంలో వైసిపి రాష్ట్ర టిట్కో డైరెక్టర్ కె.గోవిందరావు ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు వైసిపి ప్రభుత్వం చేపట్టిందని, అభివృద్ధిని చూసి ప్రతిఒక్కరు ఓటు వేయాలని ఇంటింటికి వెళ్లి కోరారు. ఆయనతో పాటు జెడ్‌పిటిసి బి.రామారావు, వైస్ ఎంపిపిలు బుడుమూరు సూర్యారావు, కృష్ణం నాయుడు పాల్గొన్నారు.

వేసవి తాపాన్ని తీర్చే తాటిముంజెలు

బూర్జ: భానుడు నిప్పులు వర్షం కురిపిస్తున్నాడు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 వరకు ఉగ్రరూపం చూపిస్తున్నాడు. మండే ఎండల నుంచి ఉపశమనం కోసం ప్రజలు తాటి ముంజల కోసం ఎగబడుతున్నారు. మండలంలోని కొల్లివలస, ఉప్పినవలస గ్రామాల జంక్షన్ల వద్ద తాటి ముంజలను విక్రయిస్తున్నారు. దీంతో ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాల్లో రాకపోకలు సాగించే ప్రయాణికులు కొనుగోలు చేస్తున్నారు. వేసవి తాపాన్ని తీర్చే ఏకైక ఔషధం తాటి ముంజలేనని స్థానికులు చెబుతున్నారు.

కొల్లివలస జంక్షన్‌లో విక్రయిస్తున్న తాటిముంజెలు

పార్టీలో చేరిన వారితో శిరీష

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి- పలాస

పలాస టిడిపి కార్యాలయంలో బుధవారం టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష సమక్షంలో మందస మండలం బహడపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న పలువురు టిడిపిలో చేరారు. వారికి శిరీష పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి నాయకులకు భయపడాల్సిన అవసరం లేదన్నారు. టిడిపి బలోపేతం చేయాలని, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా ఎంపీ రామ్మోహన్ నాయుడును గెలుపే లక్ష్యంగా పని చేయాలని కోరారు. ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తాను అండగా ఉంటామని హామీఇచ్చారు. పార్టీలో చేరిన వారిలో సత్తుపల్లి సాంబమూర్తి, పద్మ, పులారి హరీష్ తదితరులున్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సాలిన జానకిరావు, కోట నీలకంఠం, కారాగానా వల్లభరావు, మామిడి కామేష్, అందాల గిరి, సాలిన కూర్మారావు పాల్గొన్నారు.

నేడు కృష్ణదాస్ నామినేషన్

ప్రజాశక్తి- పోలాకి

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మాన కృష్ణదాస్ గురువారం వేస్తున్నారని, కార్యకర్తలు తరలిరావాలని వైసిపి జోనల్ ఇన్‌ఛార్జి, జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 9 గంటలకు పోలాకి మండలం మబగాంలో కృష్ణదాస్ నివాసం నుంచి భారీ ఊరేగింపుగా నరసన్నపేట సత్యవరం కూడలి వద్దకు చేరుకుంటామని తెలిపారు.

శిథిలావస్థలో సర్కారు భవనాలు

- భయాందోళనలో అధికారులు
- పట్టించుకోని పాలకులు, ఉన్నతాధికారులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిపాలనలో భాగంగా ప్రజలకు సేవలు అందించేందుకు గాను ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. అధికారులను నియమించారు. అందుకు చాలా ఏళ్ల క్రితం ప్రభుత్వ భవనాలు నిర్మించారు. కానీ అక్కడితో పాలకులు, అధికారులు చేతులు దులుపుకోవడంతో సర్కార్ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. శిథిలావస్థలో ఉన్న భవనాల్లో తమ విధులు నిర్వహించేందుకు అధికారులు భయాందోళనకు గురవుతున్నారు.

మండల పరిషత్ కార్యాలయం

ప్రజాశక్తి- పలాస

మండలంలోని మండల పరిషత్ కార్యాలయం సుమారు 50 ఏళ్ల క్రితం నిర్మించారు. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో మండల ప్రజలతో పాటు అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల తిత్లీ తుఫాన్ సమయంలో మండల సమావేశ మందిరం పైకప్పు ఎగిరి పోయింది. లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సీలింగ్ పూర్తిగా నాశనమైంది. చాలా ఏళ్ల క్రితం ఉన్న ఎంపిపి డల్లి లక్ష్మి నూతన భవనం నిర్మించేందుకు మండల పరిషత్ కార్యాలయంలో కొంత స్థలాన్ని ఎల్ఐసి సంస్థకు అమ్మకం చేపట్టారు. అయితే ఆ నిధులతో నిర్మాణం చేస్తామని అనుకున్న సమయంలో నిధులు కలెక్టర్ కార్యాలయానికి వెళ్లిపోవడంతో భవన నిర్మాణ పనులకు నోచుకోలేదు. ప్రస్తుతం చిన్నపాటి వర్షం కురిస్తే కార్యాలయంలో చాలా ప్రాంతాల్లో కారిపోతుందని అధికారులు, ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా వ్యవసాయ శాఖ కార్యాలయం పూర్తిగా శిథిలం కావడంతో అధికారులు భయ పడుతున్నారు. ప్రస్తుతం భవనంలో వ్యవ సాయశాఖ కార్యాలయంతో పాటు సచివాలయం ఉద్యోగులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. భవనం చాలా ఏళ్ల క్రితం నిర్మించడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందు తున్నారు. పలాస ఆర్డబ్ల్యూఎస్ కార్యాలయం, పంచాయతీ రాజ్ డివిజన్ కార్యాలయాలు శిథిలావస్థలో ఉన్నాయి. ప్రస్తుతం పంచాయతీరాజ్ అధికారులు ప్రక్కన ఉన్న డివిజన్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తుండగా ఆర్ డబ్ల్యు ఎస్ అధికారులు కార్యాల యానికి సమీపంలో ఉన్న పాత ఇఇ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. పాత భవనాలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో స్లాబ్ పెచ్చులు బయటకు దర్శనమిస్తున్నాయి. స్లాబ్ పెచ్చులు పడి ఏ ప్రమాదం సంభవిస్తుందోనని అధికారులు భయాందోళన చెందుతున్నారు. పాత భవనాలకు సమయం మించి పోయినప్పటికీ పాలకులు, అధికారులు నూతన భవనాలు మంజూరు చేయక పోవడంతో అధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏదేమైనప్పటికీ ప్రజలకు సేవలు అందిస్తున్న అధికారులకు పక్కా భవనాలు నిర్మించ ˊడంలో పాలకులు, ఉన్నతాధికారులు నిర్లక్ష్యం వహిస్తు న్నారనే చెప్పాలి. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, జిల్లా ఉన్నత అధికారులు చొరవ చూపి పాడైన భవనాలకు మర మ్మతులు చేపట్టడమే కాకుండా నూతన భవనాలు మంజూరు చేయాలని మండల ప్రజలు, అధికారులు కోరుతున్నారు.

శిథిలావస్థలో వ్యవసాయశాఖ కార్యాలయం

జిల్లాలో పలుచోట్ల వర్షం

కొత్తూరు : కురుస్తున్న వర్షం

కొత్తూరు : మండలంలో గురువారం మధ్యాహ్నం వర్షం కురిసింది. 2 గంటల సమయంలో ఒక్కసారిగా మేఘావృతమై కారు మబ్బులు అలుముకున్నాయి. అనంతరం వర్షం కురవడంతో కాస్త ఉపసమనం కలిగింది. కొద్ది రోజులుగా తీవ్ర వడగాల్పులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఈ సమయంలో కాస్త వర్షం కురవడంతో కొంత ఊరట కలిగించింది. ఈ వర్షం మామిడి, జీడి పంటలకు అనుకూలంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.

మెళియాపుట్టి : మండలంలో డిండి. మెళియాపుట్టి, వసుంధర, జాడుపల్లి, పెద్ద పద్మాపురం, పెద్దలక్ష్మీపురం గ్రామాల్లో ఈదురుగాలు, వడగళ్లతో వర్షం కురిసింది. రట్టిని వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై చెట్టు పడింది. విద్యుత్ సిబ్బంది చెట్టును తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. మామిడి, జీడి పంట నేలకొరిగాయి.

నౌపడ : ఉప్పుపై టార్పాలిన్ వేస్తున్న రైతులు

భారీ ఈదురుగాలులు

నౌపడ: సంతబొమ్మాళి మండలంలో రోజంతా ఎండ, ఉక్కపోత వడ గాల్పులతో ఒక్కరి బిక్కిరైన జనానికి సాయంత్రం వాతావరణం చల్లబడడంతో ఉపశమనం లభించింది. సాయంత్రం 4 నుంచి 4.30 గంటల వరకు ఈదురు గాలులతో ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చింది. ఈదురుగాలతో దుమ్ము, ధూళి వాతావరణం నెలకొంది. ప్రధానంగా ఉప్పు రైతులు పండించిన ఉప్పు కుప్పలు కరిగిపోతాయని భయాందోళనలు చెందారు. వర్షం నుంచి కాపాడుకునేందుకు ఉప్పుకుప్పలపై పరదాలు కప్పారు. చిన్న, చిన్న చినుకులతో వర్షం ఆగిపోవడంతో ఉప్పు రైతులు ఒకరు పీల్చుకున్నారు.

పార్టీలో చేరిన వారితో అప్పలరాజు

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- పలాస

పలాస మంత్రి కార్యాలయంలో మండలంలోని తర్లకోటకు చెందిన సుమారు 50 మంది వైసిపిలో చేరారు. వీరికి పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు వైసిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో సంధ్య, రేణుక, కుమ్ముదుని, రామ, భాను, భోగి, అప్పలమ్మ, జున్ను, పార్వతి, దమయంతి, కుంతీ, బొన్ని, నందిని, భాస్కరు, కామేశ్వర్, మధు, సమీర్, దుంబ్రు, నరసింహ, గౌరవంగా, ప్రఫుల్ల, భూమిని, శివ, రమేష్, రాజేష్, పెద్ద ఢిల్లీ, పవన్, గోవిందు, సురేష్, సంతోష్, పవన్, నాయక్, బొండుమల్లి, దీనబంధు, సంతు, జంగం, దామోదర్, చిన్న గణేష్ మరియు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొర్ల శివకృష్ణ (సంతు), చిత్తరంజన్ నాయక్, బుధు, కలియా బెహరా పాల్గొన్నారు.

జగన్‌తో ఉన్న రెడ్డి శాంతి

'సిద్ధం'లో ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం : సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి సిద్ధం ముగింపు సభ టెక్కలిలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాతపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాల్గొన్నారు. ఆయనతో కలిసి నియోజవర్గంలో ఎన్నికల కసరత్తుపై కాసేపు మాట్లాడారు.

సైనికుల క్షేమానికి పాదయాత్ర

టెక్కలి : దేశ రక్షణలో భాగంగా ఉన్న ఆర్మీ, నేవీ, వంటి సంస్థల్లో విధులు నిర్వర్తిస్తున్న సైన్యం మానసికంగా, ఆరోగ్యంగా, ధైర్యంగా ఉన్నప్పుడే దేశానికి రక్షణ ఉంటుందని శివకరణ్ గౌతమ్ అన్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు తన పాదయాత్ర ఉంటుందని తెలిపారు. బుధవారం టెక్కలి చేరుకున్న గౌతమ్‌ని హనుమంతు ఉదయ్‌భాస్కర్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా గౌతమ్ మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఫతేపూర్ జిల్లా కరోలి తన స్వగ్రామమని, 2022 మార్చి 25న పాదయాత్ర ప్రారంభించి నేటికి పన్నెండు వేల కిలోమీటర్లు పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఎండాకాలం రోజుకు 25 కిలోమీటర్లు, మిగతా కాలాల్లో రోజుకు 30 నుంచి 35 కిలోమీటర్లు వరకు నడక సాగిస్తున్నట్లు అన్నారు. కార్యక్రమంలో సాయి యోగా సెంటర్ నిర్వాహకులు చంద్రశేఖర్, తమ్మినేని ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

స్వాగతం పలుకుతున్న స్థానికులు

టిడిపిలోకి మాజీ ఎంపిపి

ప్రజాశక్తి- పోలాకి

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ప్రజాగళం పేరుతో జిల్లా పర్యటించారు. ఈ మేరకు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బగ్గు రమణమూర్తి, టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ సమక్షంలో బుధవారం టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో దోల జగన్, జలుమూరు జెడ్‌పిటిసి ప్రతినిధి మెండ రాంబాబు, సర్పంచ్, వెలమ కార్పొరేషన్ చైర్మన్ ప్రతినిధి పంగ బావాజీ నాయుడు పాల్గొన్నారు.

పార్టీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబు

బి-ఫామ్ అందజేస్తున్న శ్రీనివాస్

'దువ్వాడ' బి-ఫామ్ అందజేత

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి నియోజకవర్గ వైసిపి అభ్యర్థిగా పోటీ చేసిన దువ్వాడ శ్రీనివాస్ తన బి-ఫామ్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్‌కు బుధవారం అందజేశారు. ఈయనతో పాటు కురమాన కృష్ణారావు, సంతబొమ్మాళి ఎంపిపి ఉన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి దూరం

ప్రజాశక్తి- పలాస

వైసిపి ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీ అభివృద్ధికి నోచుకోలేదని, పారిశుధ్యం అధ్వానంగా తయారైందనిటిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు ఆరోపించారు. కాశీబుగ్గ శ్రీనివాస్ నగర్, గాయత్రి నగర్, సంజీవ్‌నగర్, నెహ్రూ నగర్, పాత జాతీయ రహదారి ప్రాంతాల్లో బుధవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. చంద్రబాబు నాయుడు అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కనీసం పట్టణ ప్రజలకు తాగునీరు సరఫరా చేయలేని పరిస్థితుల్లో మున్సిపాలిటీ ఉందని అన్నారు. రోడ్డు విస్తరణ పేరుతో తొలగించిన దుకాణాలకు ఇప్పటికీ టిడిఆర్ ఇవ్వలేదన్నారు. వారానికి ఒకసారి కూడా నీరు సరఫరా చేయలేకపోతున్నారని ఆరోపించారు. టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గౌతు శిరీషకు అవకాశం కల్పిస్తే మున్సిపాలిటీ అభివృద్ధి చేస్తారని అన్నారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎంపీ అభ్యర్థి రామ్మోహన్ నాయుడు, శిరీషను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి బిసిసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, దువ్వాడ శ్రీకాంత్, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, బి.నాగరాజు, కౌన్సిలర్ డిక్కల ఆనందరావు, మాజీ కౌన్సిలర్ వజ్జ గంగాభవాని, దానేటి పద్మజ పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

కోటబొమ్మాళి : సభకు తరలివెళ్తున్న అభిమానులు

సిద్ధం సభకు కదిలిన శ్రేణులు

కొత్తూరు : టెక్కలిలో నిర్వహించిన సిఎం జగన్ సిద్ధం సభకు మండలంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, గోగుల వరప్రసాదరావు, పి.లక్ష్మణరావు, జి.ఆనందరావు, నంద కుమార్ ఉన్నారు.

కోటబొమ్మాళి: తమ అభిమాన నాయకులు, సిఎం జగన్‌ను టెక్కలి వస్తున్నారని తెలుసుకున్న పల్లె వాసులు ఆయనను చూసేందుకు ఊర్లుఊర్లు బయలుదేరి వెళ్లారు. ఏ గ్రామంలో చూసిన వృద్ధులు, మహిళలు పెద్ద ఎత్తున తమ అభిమాన నాయకుడిని కళ్లారా చేసేందుకు జాతీయ రహదారి పొడుగునా క్యూకట్టారు. పల్లెల్లో పండగ వాతావరణం కనిపించింది. జై జగన్ అంటూ నినాదాలు చేస్తూ మండల ప్రజలు బయలుదేరారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దారిపొడవున తనకు చూసేందకు వచ్చిన ప్రజలకు అభివాదం చేశారు.

ఆర్థికసాయం అందిస్తున్న సంస్థ సభ్యులు

హెల్పింగ్ హేండ్స్ ఔదార్యం

కవిటి: హెల్పింగ్ హేండ్స్ స్వచ్ఛంద సంస్థ తన ఔదార్యాన్ని చాటుకుంది. మండలంలోని కపాసుకుద్దికు చెందిన గుంటు భాస్కరరావు కేన్సర్‌తో బాధపడుతూ విశాఖ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. చికిత్స కోసం దాదాపు రూ.8 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో దాతల కోసం ఎదురుచూస్తున్నారు. సంస్థ సభ్యుల ద్వారా విషయం తెలుసుకున్న హెల్పింగ్ హాండ్స్ సభ్యులు బుధవారం గ్రామానికి చేరుకుని ఆ కుటుంబ సభ్యులను ఓదార్చారు. అండగా ఉంటామని హామీ ఇచ్చి ఆ కుటుంబానికి రూ.5వేలు ఆర్థికసాయం, నెలరోజులకు సరిపడే నిత్యావసర సరుకులు అందించారు. అనంతరం సంస్థ సభ్యులు మాట్లాడుతూ ఆపదలో ఉన్న భాస్కరరావు కుటుంబానికి అందరూ అండగా నిలవాలని, స్థానిక స్వచ్ఛంద సంస్థలు విరివిగా ఆర్థిక సాయం అందించాలని కోరారు.

నిర్మించారు.. వదిలేశారు

ప్రజాశక్తి- టెక్కలి

ప్రజా పంపిణీ వ్యవస్థలో భాగంగా టెక్కలి మండలానికి నిత్యావసర వస్తువుల సరుకులు నిల్వ చేసుకునే గిడ్డంగిని నిర్మించారు. కానీ, ఇప్పటి వరకు వరకు ప్రారంభం కాకపోవడంతో లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన రాష్ట్ర పౌర సరఫరాల గిడ్డంగి భవనం వృథాగా ఉంది. టెక్కలి, నందిగాం, మండలాలకి నిత్యావసర వస్తువులు సరఫరా చేసేందు కు, నిల్వ ఉంచుకునేందుకు నిమిత్తం స్థానిక లచ్చన్నపేట మెట్టపై భవనాన్ని నిర్మించారు. ప్రస్తుతం భవనం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వద్ద ఉంది. అయితే అద్దె భవనంలో ఉన్న ఈ గిడ్డంగికి సొంత భవనం ఉండాలనే అప్పటి టిడిపి ప్రభుత్వం హయాంలో ప్రణాళిక తయారు చేశారు. ఆ తర్వాత ఆ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుత వైసిపి ప్రభుత్వ హయాంలో పౌర సరఫరాల గిడ్డంగి భవనం నిర్మాణం చేపట్టి పనులు పూర్తి చేశారు. ఇందులో భాగంగా లచ్చన్నపేట వద్ద స్థలం కేటాయించి రెండున్నరేళ్ల క్రితం భవనం నిర్మాణం పనులు చేపట్టారు. అయితే భవనం నిర్మాణం జరిగినా ఇంతవరకు ప్రారంభం జరగకపోవడానికి గల కారణాలు తెలియరావడం లేదు. ఇందుకు సంబంధించి సమాచారం ఇచ్చే వారు కరువయ్యారు. లక్షలాది రూపాయలు వెచ్చించి భవనం నిర్మాణం చేపట్టడం ఎందుకు వృథాగా వదిలేయడం అనే ప్రశ్నలకు సమాధానాలు దొరకడం లేదు. అయితే భవనం నిర్మాణంలో సాంకేతిక లోపాలు ఉండడం వల్లే ప్రారంభం జరగలేదని తెలిసినా... అది ఎంతవరకు నిజం అన్నది తెలియరావడం లేదు. దీనిపై సంబంధితశాఖ ఉన్నతస్థాయి అధికారులు స్పందిస్తే మంచిదని పలువురు కోరుతున్నారు.

ప్రారంభానికి ఎదురుచూస్తున్న భవనం

ఎంపీ అభ్యర్థిగా రామ్మోహన్‌నాయుడు నామినేషన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తెలుగుదేశం పార్టీ శ్రీకాకుళం పార్లమెంట్ స్థానం అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపి కింజరాపు రామ్మోహన్ నాయుడు బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. కలెక్టరేట్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి మనజీర్ జిలానీ సమూన్‌ను కలిసి నామినేషన్ పత్రాలను అందజేశారు. ఆయనతో పాటు ఆయన చిన్నాన్నలు కింజరాపు హరివర ప్రసాద్, కింజరాపు అచ్చెన్నాయుడు, మాజీ మంత్రి గౌతు శివాజీ, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకట రమణలు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయం, తాగునీటి అనుసంధానం, నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే ధ్యేయమన్నారు. రాష్ట్ర ప్రజలను మరో మారు మోసం చేసేందుకు జగన్ చేస్తున్న ప్రయత్నాలను తిప్పి కొట్టాలన్నారు. వారితో పాటు ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, కొర్ను ప్రతాప్, పిఎంజెబాబు, సింత సుధాకర్ పాల్గొన్నారు.

నామినేషన్ పత్రాలను అందజేస్తున్న రామ్మోహన్ నాయుడు

నామినేషన్ పత్రాలను అందజేస్తున్న విక్రాంత్

టెక్కలిలో రెండు నామినేషన్లు

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కిల్లి విక్రాంత్ బుధవారం నామినేషన్ వేశారు. ఈ మేరకు నామినేషన్ పత్రాన్ని ఎన్నికల రిటర్నింగ్ ఆధికారి, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌కు బుధవారం నామినేషన్ పత్రాన్ని అందజేశారు. ప్రస్తుత అభ్యర్థి, కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి పెద్దకుమారుడు విక్రాంత్ కాంగ్రెస్ పార్టీ నుంచి డమ్మీ అభ్యర్థిగా నామినేషన్ వేసినట్లు తెలిపారు. ఈయనతో పాటు ఆ పార్టీ నాయకులు టి.బి.జె.గుప్త, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జై భారత్ నేషనల్ పార్టీ టెక్కలి నియోజకవర్గ అభ్యర్థిగా బైపల్లి పరమేశ్వరరావు నామినేషన్ దాఖలు చేశారు. ఈ మేరకు తన నామినేషన్ పత్రాన్ని ఎన్నికల రిటర్నింగ్ ఆధికారి, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌కు అందజేశారు.

బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

బస్సుల్లేక ప్రయాణికుల పాట్లు

ప్రజాశక్తి- పలాస

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా టెక్కలిలో సిద్ధం సభ నిర్వహించారు. ఈ సభకు ప్రజలను తరలించేందుకు ఆర్‌టిసి బస్సులను వినియోగించారు. ముందస్తు సమాచారం ఇవ్వక పోవడంతో ప్రయాణికులు వేకువ జామున 4.30 గంటల నుంచే బస్ కాంప్లెక్స్ వద్ద బస్సుల కోసం వేచి ఉన్నారు. ఏడు గంటలు కావస్తున్నా బస్సులు రాకపోవడంతో ఆర్‌టిసి సర్వీసులు నిలిపివేశారని తెలిసింది. అనంతరం ప్రయివేటు ట్రావెల్స్, ఒడిశా బస్సులను ఆశ్రయించారు. జగన్ సిద్ధం సభకు ప్రజలను తరలించేందుకు పలాస, టెక్కలి, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ ఆర్‌టిసి బస్సులను వేశారు.

కొత్తూరు : టెక్కలిలో సిఎం జగన్మోహన్‌రెడ్డి నిర్వహించిన సిద్ధం సభకు జనాలను తరలించేందుకు ఆర్‌టిసి బస్సులను వేశారు. బస్సు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. చివరకు ఆటోలు కూడా ప్రజలను తరలించడానికి ఉపయోగించడంతో ప్రయాణికులు అవస్థలు వర్ణనాతీతం. వాహనాలు లేకపోవడంతో గంటల కొద్దీ ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో వేచి ఉండాల్సి వచ్చింది.

నామినేషన్ దాఖలు చేస్తున్న చక్రవర్తిరెడ్డి

కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మాసుపత్రి చక్రవర్తిరెడ్డి బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. పట్టణ పుర వీధుల్లో కాంగ్రెస్ కార్యకర్తల ర్యాలీతో స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుదర్శనదొరకు నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే తనను ఒక్క అవకాశం ఇచ్చి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ఆలీం ఖాన్ పాపారావు. వాసు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కోలాహలంగా అశోక్ నామినేషన్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

అభివృద్ధి, సంక్షేమం టిడిపి రెండు కళ్లు అని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బెందాళం అశోక్ అన్నారు. ఈ మేరకు రిటర్నింగ్ అధికారి సుదర్శన దొరకు బుధవారం నామినేషన్ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాక్షస పాలన నుంచి ఎప్పుడు విముక్తి లభిస్తుందా? అని రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. అలాగే వరసగా రెండుసార్లు అఖండ విజయం అందించిన ప్రజానీకానికి మూడో సారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తానని హామీనిచ్చారు. ఎన్నికల ప్రచారంలో ఎక్కడకి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. జన సైనికులు ఉత్సాహం, బిజెపి కార్యకర్తల సంపూర్ణ సహకారంతో విజయ ఖామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ నలుమూలల నుంచి భారీగా అభిమానులు, కార్యకర్తలు తరలివచ్చారు.

ఇచ్ఛాపురం : నామినేషన్ పత్రం అందజేస్తున్న అశోక్

అభిమానుల సమూహంగా..

కవిటి: ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. మండలంలోని రామయ్యపుట్టుగలోని ఆయన క్యాంపు కార్యాలయం నుంచి నియోజకవర్గ టిడిపి, జనసేన, బిజెపి శ్రేణులతో పాటు అశేషంగా తరలివచ్చిన ఆయన అభిమానులతో కలిసి ర్యాలీగా బయలుదేరారు. కవిటి నుంచి రాజపురం, కొజ్జిరి మీదుగా సాగిన ర్యాలీ ఇచ్ఛాపురం చేరుకుంది.

అట్టహాసంగా ధర్మాన నామినేషన్

80అడుగుల రోడ్డులో ర్యాలీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రెవిన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు బుధవారం శ్రీకాకుళం నియోజక వర్గం నుంచి వైసిపి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. నగరంలోని 80అడుగుల రోడ్డు నుంచి వాంబే కాలనీ వరకు కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయన ఆర్‌డిఒ కార్యాలయంలో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సిహెచ్ రంగయ్యకు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఆయనతో పాటు వైసిపి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శిమ్మ రాజశేఖర్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి హాజరయ్యారు. అనంతరం వాంబే కాలనీ వద్ద జరిగిన సభలో మంత్రి ధర్మాన మాట్లాడుతూ నియోజకవర్గంలో విజయం వరించబోతోందని, అభిమానులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా నామినేషన్ కార్యక్రమానికి మండుటెండను లెక్క చేయకుండా తరలిరావడం బట్టి తనపట్ల ఉన్న నమ్మకం బయటపడిందన్నారు. ఈ ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారా అభివృద్ధి పనులు పూర్తి చేసి ప్రజలకు ఫలాలు అందించడానికి దోహదపడుతుందన్నారు. శ్రీకాకుళం నియోజకవర్గంతో పాటు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీలో ఉన్న పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అంధవరపు సూరిబాబు, శిమ్మ రాజశేఖర్, ఎంవి స్వరూప్, సాధు వైకుంఠరావు, నాయకులు పాల్గొన్నారు.

నామినేషన్ దాఖలు చేస్తున్న ధర్మాన

కిరణ్ కుమార్ నామినేషన్

రణస్థలం: ఎచ్చెర్ల నియోజకవర్గం అసెంబ్లీ స్థానానికి వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా సిటింగ్ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ నామినేషన్‌ను బుధవారం అట్టహాసంగా జరిగింది. వేలాది మంది అభిమానులతో ఆయన ర్యాలీగా వచ్చి నామినేషన్ దాఖలు చేశారు. అలాగే డమ్మీ అభ్యర్థి ఎమ్మెల్యే కిరణ్ కుమార్ భార్య పరిమళ నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పార్టీ జెండాలతో కదంతొక్కారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా కిరణ్ కుమార్‌తో కలిసి అడుగులు వేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.వి.లక్ష్మణ మూర్తికి నామి నేషన్ పత్రాలను అందజేశారు.

అలాగే టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు, డమ్మీ అభ్యర్థిగా ఎన్ఈశ్వర్ భార్య రజనీ నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే బిఎస్‌పి నుంచి గంట్లన రామారావు నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి కొత్తకోట్ల సింహాద్రి నాయుడు నామినేషన్ దాఖలు చేశారు.

నామినేషన్ పత్రాలు అందజేస్తున్న కిరణ్ కుమార్

సందడిగా 'సువ్వారి' నామినేషన్

ప్రజాశక్తి- ఆమదాలవలస

నియోజకవర్గంలో అనాలోచిత నిర్ణయాలతో విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించిన ఘనత స్పీకర్ తమ్మినేని సీతారాంకే దక్కుతుందని స్వతంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీ అన్నారు. బుధవారం పట్టణంలోని బొడ్డేపల్లిపేట వద్ద నున్న ఆయన కార్యాలయం నుంచి కార్యకర్తలతో కలిసి ర్యాలీగా బయలుదేరి తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి ఎం.నవీన్‌కు సమర్పించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలో సరుబుజ్జిలి, బూర్జ మండలాల్లో డిగ్రీ కళాశాలలు లేక విద్యార్థులు విద్యను అభ్యసించడానికి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటుంటే స్పీకర్ తమ్మినేని సీతారాం మాత్రం తన స్వగ్రామం తొగరాంలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. పొందూరు మండలంలోని రెల్లిగడ్డ, ఆమదాలవలస మండలంలోని కొత్త గడ్డ, బూర్జ మండలంలో ఒనిగడ్డ గత ఐదేళ్లుగా ఎటువంటి అభివృద్ధికి నోచుకోక రైతులు తీవ్ర సాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ స్పీకర్ పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని తనకు ఒక్క అవకాశం ఇచ్చి చూడాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సువ్వారి సువర్ణ, పొందూరు మాజీ ఎంపిపి సువ్వారి దివ్య, సత్యనారాయణ, పేడాడ వైకుంఠరావు, సువ్వారి అనీల్, అన్నెపు సూరిబాబు పాల్గొన్నారు.

స్వతంత్ర అభ్యర్థి 'సువ్వారి' నామినేషన్